క్లుప్తంగా

సాగునీరు అందించాలి



ములుగు రూరల్: యాసంగి పంటలను సాగు నీరు అందించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సానికొమ్ము రమేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని దేవగిరిపట్నం, పత్తిపల్లి, చింతలపల్లి గ్రామాల్లో వరిని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎదల్ల చెరువు, రంగాయ చెరువు ఆయకట్టులో సాగు చేసిన వరికి నీరు అందక ఎండిపోతుందని అన్నారు. దేవాదుల పైప్‌లైన్ ద్వారా నీటిని అందించి పంటను కాపాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.

సమ్మక్క-సారలమ్మ జాతర



మంగపేట: మండలంలోని మల్లూరు పంచాయతీ పరిధిలోని మామిడిగూడెంలో కొలువుదీరిన సమ్మక్క-సారలమ్మ జాతర మంగళవారం నుంచి ఈనెల 08 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి(దేవరబాల) పూనెం జనార్దన్ తెలిపారు. జాతర ప్రారంభంలో భాగంగా మండెమెలిగె కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ.. ఐదు రోజుల పాటు జరిగే జాతరకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వడ్డెలు రేగ లక్ష్మయ్య, తలపతి పూనెం వెంకటేశ్వర్లు, నిర్వాహకులు వాసం సాంబశివరావు, ఎట్టి సాయి, తాటి చందు, నాగమల్లేశ్ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

ఏటూరునాగారం: ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని వైఆర్‌జీ కేర్ సంస్థ లింక్ వర్కర్ కిషన్, ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్, మానసపల్లి ప్రాంతాల్లో మిషన్ 95 హెల్త్ క్యాంపు నిర్వహించి పలువురికి పరీక్షలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ హెచ్ఐవీ పరీక్ష చేయించుకోవాలని చెప్పారు. సమీపంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిలో ఐసీటీసీ సెంటర్‌లో హెచ్ఐవీ పరీక్ష ఉచితంగా చేయడంతోపాటు కౌన్సిలింగ్ కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. క్యాంప్‌లో వైఆర్‌జీ కేర్ సూపర్‌వైజర్ రజిని, ఆశ వర్కర్ నాగమణి పాల్గొన్నారు.

వంటపాత్ర బహూకరణ

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని శ్రీ ఉమారామలింగేశ్వరస్వామి ఆలయానికి ప్రసాదాన్ని వండటానికి నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు మంగళవారం వంట చేసే 50 కిలోల వంటపాత్రను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మడుగూరి ప్రసాద్, కమిటీ సభ్యులు ఇర్సవడ్ల కిరణ్, వల్స తిరుపతి, దుర్గం కొమురయ్య, రామ్‌లాల్, నాయీబ్రహ్మణ సంఘం నాయకులు దడిగెల సత్యం, నారాయణ, మహేందర్, లక్ష్మణ్, నర్సింహులు, రాజారాం ఉన్నారు.

చర్య తీసుకోవాలని వినతి



వెంకటాపురం(కె): కనీస మౌలిక సదుపాయాలు కల్పించని ప్రైవేట్ పాఠశాలలపై విచారణ చేసి చర్య తీసుకోవాలని కోరుతూ.. మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణకు ఎస్ఎఫ్ఐ నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జాగటి రవి మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల్లో సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నాయకులు చరణ్, కార్తీక్, పవన్, కోగిల చరణ్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ వినియోగదారుల సదస్సు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణంలో మంగళవారం విద్యుత్ వినియోగదారుల సదస్సును విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ వేనుగోపాలచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సదస్సులో వెంకటాపురం, వాజేడు మండలాలకు చెందిన రైతులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఏడీఏ ఆకిటి స్వామి తదితరులు ఉన్నారు.

బిల్లులు చెల్లించాలి

మంగపేట: మండలంలోని చుంచుపల్లిలోని చెంచులక్ష్మి, నర్సింహస్వామి ఎస్టీ ఇసుక క్వారీ సొసైటీ ఇసుక క్వారీల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఆదివాసీ సేన మండల అధ్యక్షుడు పోలెబోయిన ఆదినారాయణ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి పెడింగ్ బిల్లులు చెల్లిస్తే గిరిజన కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అవుతారన్నారు.

గుక్కపడితే ఇంటికి ఉరుకుడే..



ఇంటి దగ్గర నుంచి భోజన సమయంలో బాటిళ్లు తెచ్చుకున్న విద్యార్థులు

- తాగు నీరు లేక విద్యార్థుల ఇబ్బందులు
- రూ.లక్షలు వెచ్చించినా అందని నీరు
- ఇంటి నుంచి వాటర్ బాటిళ్లు
- పట్టించుకోని పాలకులు, అధికారులు





పాఠశాలలో పనిచేయని నల్లాలు

ఏటూరునాగారం: అన్నం తినేటప్పుడు విద్యార్థులకు గుక్కపడితే తాగు నీటి కోసం ఇంటికి ఉరకాలిన్న పరిస్థితి మండలంలోని శివాపురం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో నెలకొంది. పాఠశాలలో ఉన్న నల్లాలు, మోటారు పని చేయడం లేదు. దీంతో పాఠశాలలో 35 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు సైతం తాగునీటికోసం తండ్లాడుతున్నారు. నీటి వసతి లేక ఇంటి నుంచి బాటిళ్లను తెచ్చుకొని దాహార్తిని తీర్చుకోవాల్సిన దుస్థితి. ఉదయం వచ్చే సమయంలో వాటర్ బాటిళ్లలో నీరు తెచ్చుకుంటున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో ఒక వేళా బాటిళ్లలోని నీరు అయిపోతే ఇంటికి వెళ్లాల్సిందే. అమ్మ ఆదర్శ పాఠశాల కింద ప్రభుత్వం శివాపురం పాఠశాల అభివృద్ధి కోసం రూ.4.4 లక్షలు మంజూరు చేశారు. ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షణలో కాంట్రాక్టర్ పనులు చేపట్టారు. బడిలోని గదులకు మరమ్మతులు, కలరింగ్ పనులు చేసి చేతులు దులుపుకున్నాడు. ఇంకా పాఠశాల పైకప్పు వేయాల్సి ఉంది. తాగునీటి వసతి కోసం ఎలాంటి ఏర్పాటు చేయలేదు. ఇంజనీరింగ్ అధికారులు కమిషన్లకు కక్కుర్తి పడి పనులను పరిశీలించకుండానే బిల్లులు చెల్లించడం సరికాదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా పాఠశాలలో తాగునీటి వసతి కల్పించి విద్యార్థులు, ఉపాధ్యాయుల ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఐటీడీఏ ఏఈ లక్ష్మణ్‌ను వివరణ కోరగా అక్కడ బయట నల్లాకు కనక్షన్ ఇచ్చామన్నారు. తాగునీటి కోసం తగిన ఏర్పాట్లు చేస్తామని, విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు.

ఇంటి నుంచే పంపుతున్నాం..



ఇంటి దగ్గర నుంచి వాటర్ బాటిళ్లను పంపుతున్నాం. నీళ్లు అయిపోతే మళ్లీ వచ్చి తీసుకెళ్తారు. నీరు ఇవ్వాలని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. దీంతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారు.

- సరస్వతి, విద్యార్థిని తల్లి శివాపురం

ఆర్ఓ ప్లాంట్ పెట్టాలి

శివాపురంలో ఉన్న పాఠశాలలో ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాలి. ఈమేరకు అధికారులు ఆదేశాలు ఇచ్చినా సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు పెట్టలేదు. గతంలో వచ్చిన నిధులతో పనులు చేశారు. తాగునీటికి ఎలాంటి వసతి లేక ఇబ్బంది పడుతున్నాం.

- ప్రతాప్, ప్రధానోపాధ్యాయుడు, శివాపుర

ఆదివాసీ చట్టాలను అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వెంకటాపురం(కె): ఏజెన్సీలో ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు తుర్స కృష్ణబాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెసా చట్టాలకు వ్యతిరేకంగా కొందరు వ్యక్తులు ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని క్రయవిక్రయాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై అధికారులు విచారణ చేసి బాధ్యులపై చర్య తీసుకోవాలని అన్నారు. నాయకులు తాటి రాంబాబు, బొగ్గుల రాజ్‌కుమార్,సంపత్, అర్జున్, నవదీప్ తదతరులు ఉన్నారు.

బీఎస్పీతోనే సమస్యల పరిష్కారం

- తడికెల శివకుమార్



మాట్లాడుతున్న తడికెల శివకుమార్

వాజేడు: బీఎస్పీ రాజ్యాధికారం సాధించడం ద్వారా ప్రజా సమస్యలు అన్ని పరిష్కారం అవుతాయని ఆ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం ఇన్‌చార్జ్ తడికెల శివకుమార్ అన్నారు. మండల కేంద్రంలో మండల ఇన్‌చార్జ్ కుమ్మరి రాంబాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం బహుజన సమాజ్ పార్టీతో ప్రతి ఒక్కరూ కలిసి రావాలని అన్నారు. ఈ సమావేశంలో కొండా చరణ్, మధు, సాంబ శివరావు, ఏసు, రాంబాబు, బాబు, అజ్జు, శివ, శేషుకుమార్ తదితరులున్నారు.

ప్రైవేట్ మార్కెట్‌తో పోటీపడాలి

- ఎండీపీ ట్రైనర్, కన్సల్‌టెంట్ విజయ్‌కుమార్



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

ఏటూరునాగారం: ఐటీడీఏ పరిధిలోని చిన్న తరహా కుటీర పరిశ్రమల నిర్వాహకులు ప్రైవేట్ మార్కెట్‌తో పోటీపడాలని మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ట్రైనర్, కన్సల్‌టెంట్ విజయ్‌కుమార్ అన్నారు. ఐటీడీఏ పరిధిలోని కుటీర పరిశ్రమల నిర్వాహకులకు ఐదురోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం మండల కేంద్రంలోని వైటీసీలో చేపట్టారు. సెంట్రల్ ఇనిస్ట్యూట్ ఆఫ్ టూల్స్ డిజైన్ సంస్థ ద్వారా మహిళా సంఘాల నిర్వాహకులకు ట్రైనింగ్ ఇచ్చారు. శివాపురం సబ్బు పరిశ్రమ చాలా బాగా రన్ చేస్తున్నారని నిర్వాహకులు సౌజన్య, రమను అభినందించారు. కార్యక్రమంలో ట్రైనర్ ఉదయ్, సిబ్బంది ఉపేందర్, జేఆర్‌పీ భిక్షపతి పాల్గొన్నారు.

సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని క్రాస్ రోడ్డు ప్రాంతంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న మాట్లాడుతూ.. 25 ఏళ్లుగా జాతీయ రహదారి మూసుకుపోయి ప్రయాణికులు వాహనదారులు అనేక అవస్థలు పడ్డారని తెలిపారు. మంత్రి సీతక్క చొరవతో రహదారి తెరుచుకుందన్నారు. సీతక్కకు, పోలీస్ శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రోడ్డు వెంట ఉన్న తాటి చెట్లు, ఇతర తుప్పలను వెంకన్న దగ్గరుండి జేసీబీతో తొలగించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్, జిల్లా ఉపాధ్యక్షుడు ఖలీల్ ఖాన్, జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, రవాణాశాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వావిలాల నరసింగరావు, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, నాయకులు మడుగురి ప్రసాద్, అధికార ప్రతినిధి ముక్కెరలాలయ్య, కన్నాయిగూడెం మండలాధ్యక్షుడు అప్సరపాషా, రాధిక, అరుణ, మానసతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆశకార్యకర్తలకు శిక్షణ

వాజేడు: మండల పరిధిలోని పేరూరు వైద్యశాలలో వైద్యాధికారి రాహిల్ వ్యాధి నిరోధక టీకాలపై ఆశ కార్యకర్తలకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాధి నిరోధక టీకాల ఆవశ్యకత, అసంక్రమిత వ్యాధులు, బీపీ, షుగర్ వ్యాధుల స్క్రీనింగ్‌పై వివరించారు. ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో వడగాలుల మూలంగా ప్రజలకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో హెచ్ఈఓ వేణుగోపాల కృష్ణ, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ములుగు రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రేమ్‌నగర్, డిగ్రీ కళాశాల, ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్, జాకారం కాటన్ ఇండస్ట్రీస్ పరిధిలో విద్యుత్ సరఫరాలో నేడు (బుధవారం) అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ రవి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ లైన్ల మరమ్మతులో భాగంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్ర 5 గంటల వరకు అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇంటర్ పరీక్షలకు సిద్ధం

వాజేడు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నేటి (బుధవారం) నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలకు సిబ్బంది సిద్ధం చేశారు. వాజేడు, వెంకటాపురం(కె) మండలాల్లో చదువుతున్న విద్యార్థులు కళాశాలలో పరీక్షలు రాయనున్నారు. మొదటి సంవత్సరంలో 174 మంది ద్వితీయ సంవత్సరంలో 142 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. కళాశాలలో ఇప్పటికే సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి సిబ్బందికి సూచనలు చేశారు. పరీక్షలు జరుగుతున్న కళాశాల నుంచి 100 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ విధించామని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని ఆ సమయంలో సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి వేయాలని అధికారులు జిరాక్స్ సెంటర్ల నిర్వాహకులకు ఆదేశాలను జారీ చేశారు.

అరెస్టులు సరికాదు



అరెస్టు అయిన అంగన్‌వాడీ టీచర్లు

ములుగు రూరల్: అంగన్‌వాడీ టీచర్ల అక్రమ అరెస్టులు సరికాదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ అన్నారు. మంగళవారం అంగన్‌వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ)ఆధ్వర్యంలో ప్రజాభవన్ ప్రజావాణిలో వినతిపత్రం అందజేసేందుకు వెళ్తున్న అంగన్‌వాడీలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన వారిలో ప్రేమకుమారి, పద్మ, భాగ్యలక్ష్మీ, రేణుక, సరిత, సూరమ్మ, వెంకటరమణ, రజిత, భవాని, సుజాత, యశోద ఉన్నారు.

అధికలోడ్‌తో వెళ్తున్న ఇసుక లారీ పట్టివేత

ఏటూరునాగారం: మండలంలోని చిన్నబోయినపల్లి వద్ద ఇసుక లారీల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్టు వద్ద రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ శంకర్, కానిస్టేబుల్ లక్ష్మణ్‌నాయక్‌లు కలిసి అధికలోడ్‌తో వెళ్తున్న ఇసుక లారీని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మంగళవారం చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేయగా ఏటూరునాగారం క్వారీ నుంచి అధికలోడుతో వెళ్తున్న లారీని పట్టుకున్నామన్నారు. ఇసుక లారీలో అధికలోడు ఉంటే ఉపేక్షించేది లేదని శంకర్ తెలిపారు.

శ్రీపాల్‌రెడ్డి గెలుపుతో సంబురాలు



ములుగు రూరల్: వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీఆర్టీయూ అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డి గెలుపొందడంతో మండలంలోని పత్తిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం సంబురాలు చేసుకున్నారు. పీఆర్టీయూ సభ్యుడు అంగోత్ రాజునాయక్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ప్రేమలత, పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, మురళీధర్, శ్రీనివాస్, రజిత, శివరాం, రవి, రజనీకాంత్, నర్సింహచారి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న మంత్రి సీతక్క

- గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బానోత్ రవిచందర్



నీటి విడుదలకు కొబ్బరికాయ కొడుతున్న రవిచందర్

ములుగు రూరల్: ఎన్నికల ముందు ఇచ్చిన మాటకు కట్టుబడి రైతులకు మంత్రి సీతక్క నీటిని విడుదల చేయించారని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బానోత్ రవిచందర్ అన్నారు. మండలంలోని పత్తిపల్లి శివారులో గల ఎదల్ల చెరువు, రంగాయచెరువు ఆయకట్ట కింద యాసంగి సాగుకు ఎదల్ల చెరువు సమీపంలో ఏర్పాటు చేసిన దేవాదుల పైపులైన్ వద్ద మంగళవారం నీటిని రవిచందర్ విడుదల చేసి మాట్లాడారు. రైతులు సాగు చేసిన ప్రతీ ఎకరాకు నీరు అందిస్తామని తెలిపారు. పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు ఈ ప్రాంత రైతులకు దేవాదుల నీటిని విడుదల చేయించలేకపోయారని అన్నారు. రైతులు సాగు చేసిన యాసంగి పంటలో నీరు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. యాసంగి సాగుకు నీటి విడుదల చేయడంతో రైతులు మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎండీ చాంద్‌పాషా, నాయకులు మావురపు తిరుపతిరెడ్డి, నల్లెల్ల భరత్‌కుమార్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

- ఎంఈఓ జీవీవీ సత్యనారాయణ



ప్రోత్సాహకాలను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

వెంకటాపురం(కె): విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని మండల విద్యాశాఖ అధికారి జీవీవీ సత్యనారాయణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. అనంతరం గత పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పాఠశాలలో 1988-89 పదో తరగతి విద్యార్థులు ప్రోత్సాహకాలను అందజేశారు. హైదరాబాద్ సీటీ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న పూర్వ విద్యార్థి చిన్ని కృష్ణ ఆధ్వర్యంలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు రూ.పది వేలు, ద్వితీయ, తృతీయ స్థానంలో ఉన్న విద్యార్థులకు రూ.5 వేలు అందజేశారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

- ఏటీడబ్ల్యూఓ క్షేత్రయ్య



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న క్షేత్రయ్య

వెంకటాపురం(కె): పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఏటీడబ్ల్యూఓ క్షేత్రయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గిరిజన బాలుర వసతి గృహం, చిరుతపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సోమ్లు, వార్డెన్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

మిర్చికి రూ.25 వేల ధర చెల్లించాలి

- రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకటరెడ్డి



రైతులతో మాట్లాడుతున్న వెంకటరెడ్డి

వెంకటాపురం(కె): మిర్చికి క్వింటాకు రూ.25 వేల ధర చెల్లించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మిర్చి కల్లాలను ఆయన సందర్శించి మాట్లాడారు. జిల్లాలో 25 వేల ఎకరాల్లో రైతులు మిర్చి పంటను సాగు చేశారని అన్నారు. రెండు సంవత్సరాలుగా రైతులు గిట్టుబాటు ధర లేక, తెగుళ్లతో దిగుబడి రాక నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 6న వెంకటాపురం మండలంలో నిర్వహించే మిర్చి రైతుల జిల్లా సదస్సును రైతులు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గ్యానం వాసు, తోట నాగేశ్వరావు, కట్ల నర్సింహాచారి, జిమిడి బాబురావు, రాములు, ప్రవీణ్, నవీన్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



అందజేసిన పరీక్ష ప్యాడ్లతో విద్యార్థులు

వెంకటాపురం(ఎం): మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు మంగళవారం ఎస్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు మామిడిశెట్టి కోటి పెన్నులు, పరీక్ష ప్యాడ్లను అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కోటి మాట్లాడుతూ.. మంత్రి సీతక్క ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివి పీహెచ్‌డీ పట్టా పొందారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లపై సామగ్రి ఉంచితే చర్యలు

- ఈఓ పెంట రఘు



ఫుట్‌పాత్‌పై సామగ్రి తొలగిస్తున్న ఈఓ రఘు

ములుగు: జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన నిర్మించిన ఫుట్‌పాత్‌పై వ్యాపారులు ఎలాంటి సామగ్రి ఉంచినా వెంటనే వాటిని గ్రామ పంచాయతీ స్వాధీనం చేసుకోవడంతో పాటు తగిన చర్యలు తీసుకుంటామని ఈఓ పెంట రఘు హెచ్చరించారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి మంగళవారం సాయంత్రం బస్టాండ్ సమీపంతో పాటు రహదారి వెంబడి ఫుట్‌పాత్‌పై ఉంచిన సామగ్రిని స్వాధీనం చేసుకోని గ్రామ పంచాయతీ కార్యాలయానికి తరలించారు. దీంతో వ్యాపారులు అందరు ఈఓ కార్యాలయానికి చేరుకొని తమ సామగ్రిని తిరిగి ఇవ్వాలని కోరారు. ఈఓ వ్యాపారులకు ఫైన్ వేసి ఇకముందు నిబంధనలకు విరుద్ధంగా నడుచుకుంటే ఊరుకునేది లేదని అన్నారు.

ఆర్థిక సాయం

ములుగు రూరల్: మండలంలోని బరిగలానిపల్లి గ్రామానికి చెందిన బరిగల సాంబయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రవిచందర్ మంగళవారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, సుమన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, భరత్‌కుమార్, కుమార్‌గౌడ్, తిరుపతి, సురేందర్, లక్కి ఉన్నారు.